క్లుప్తంగా

రాష్ట్ర వలంటీర్ల విభాగం కార్యదర్శిగా సుధీర్



చుండూరు(వేమూరు): వైఎస్సార్‌సీపీ వేమూరు నియోజకవర్గ సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు రాష్ట్ర వలంటీర్ల విభాగం కార్యదర్శిగా తన నియామకం కోసం కృషి చేశారని గాజులవర్తి సుధీర్ తెలిపారు. చెరుకుపల్లి గ్రామంలోని పార్టీ కార్యాలయంలో వరికూటి అశోక్‌బాబును శుక్రవారం ఆయన కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వలంటీర్ల సమస్యలు కోసం నిరంతరం పని చేస్తానన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, గ్రామ సర్పంచ్ శ్రీనివాసరావు, గాజులవర్తి సంజీవ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

వీనులవిందుగా శ్రీకృష్ణ జనన ప్రవచనం



కొల్లూరు: భాగవత సప్తాహ జ్ఞాన యజ్ఞ 109వ మహోత్సవాలలో భాగంగా జరుగుతున్న ప్రవచనాలకు భక్తుల నుంచి అపూర్వ స్పందన లభిస్తుంది. కొల్లూరు శంకర సేవా సమితి ఆధ్వర్యంలో శ్రీపార్వతీ సంస్కృత పాఠశాలలో జరుగుతున్న ప్రవచన కార్యక్రమాలలో భాగంగా శుక్రవారం శ్రీకృష్ణ జననం కథా పఠనంను ప్రవచకులు తంగిరాల రాజేంద్రప్రసాద్ భక్తులకు వీనుల విందుగా వినిపించారు. ప్రవచన శ్రవణానికి అధిక సంఖ్యలో పాల్గొన్న భక్తులు ఈ సందర్భంగా శ్రీకృష్ణుని ఊయలలో వేసే కార్యక్రమంలో పాల్గొని పరవశానికి లోనయ్యారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాద వినియోగం చేశారు. ప్రవచన కార్యక్రమ దాతలుగా భాగవతుల శ్రీరామచంద్రశేఖర్ వ్యవహరించారు. శనివారం రుక్మిణి కల్యాణం జరుగుతుందని శంకర్ సేవా సమితి సభ్యులు కల్లూరు వెంకట సూర్యనారాయణమూర్తి తెలియజేశారు.

అన్న సంతర్పణకు విశేష స్పందన



కొల్లూరు : వినాయక చవితి ఉత్సవాలలో భాగంగా కొల్లూరు విఘ్నేశ్వరాలయం వద్ద ఏర్పాటు చేసిన వినాయక మండపం ఏర్పాటు చేశారు. అందులో భాగంగా శుక్రవారం భక్తులకు అన్నదానం చేశారు. వినాయక నిమజ్జనోత్సవాలు ముగింపు దశకు చేరుకున్న తరుణంలో వినాయకుడి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన బొజ్జ గణపయ్య ప్రతిమను శనివారం నిమజ్జనం చేసేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. వినాయక చవితి ఉత్సవాలలో భాగంగా నిత్య పూజలు అందుకుంటున్న లంబోదరుడి విగ్రహం వద్ద గత తొమ్మిది రోజులుగా నిర్వహిస్తున్న అన్న సంతర్పణకు విశేష స్పందన లభిస్తుంది.

రోడ్లపై ఆవులు కనిపిస్తే గోశాలకు తరలింపు

మునిసిపల్ కమిషనర్ సాంబశివరావు



రేపల్లె: నిత్యం పట్టణంలో రోడ్లపై తిరుగుతూ వాహదారులకు అంతరాయం కలిగిస్తూ ప్రమాదాలకు గురిచేస్తున్న ఆవులను శుక్రవారం మునిసిపల్ అధికారులు పట్టించి తెనాలి, గుంటూరులలోని గోశాలలకు తరలించారు.

మునిసిపల్ కమిషనర్ కె.సాంబశివరావు ఆదేశాల మేరకు శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఆకురాతి సాంబశివరావు తన సిబ్బందితో మార్కెట్ ఏరియా, బస్టాండ్ ఏరియా, శంకర్ విలాస్ సెంటర్, రింగ్ రోడ్డు ఏరియాలలో రోడ్లపై తిరిగే ఆవులను ఉదయం 5 గంటల నుంచి ఆంధ్రరత్న హైస్కూల్ గ్రౌండ్‌లోకి తరలించి అక్కడ నుంచి లారీల ద్వారా గోశాలలకు తరలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ రేపల్లె పట్టణంలో రోడ్లమీదకు ఆవులను యజమానులు వదలకుండా ఇళ్ల వద్దనే కట్టివేయాలని సూచించారు. ఇప్పటి నుంచి ఎక్కడైనా పట్టణంలో ఆవులు కనిపిస్తే గోశాలకు తరలించటం జరుగుతుందని ఆయన హెచ్చరించారు.

ట్రాఫిక్‌తో సతమతం..!

- చెరుకుపల్లిలో ఇష్టానుసారం పార్కింగ్‌లతో ఇబ్బందులు
- పోలీసులు సమస్యను పరిష్కరించాలని కోరుతున్న ప్రజలు



చెరుకుపల్లిలో నిలిచిపోయిన ట్రాఫిక్



జాతీయ రహదారిపై నిబంధనలకు విరుద్ధంగా ఉన్న కళాశాల బస్సులు



జాతీయ రహదారిపైనే వ్యాపారాలు చేస్తున్న దృశ్యం

చెరుకుపల్లి: మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో రోజురోజుకు ట్రాఫిక్ సమస్య మరింత తీవ్రమవుతుంది. మండల కేంద్రానికి ప్రతి రోజు ఆస్పత్రులు, కళాశాలలకు, వ్యాపారాల నిమిత్తం వస్తున్న ద్విచక్ర వాహనాలు, ఆటోలు, కార్లు, బస్సులు, ట్రాక్టర్లు, లారీలతో ట్రాఫిక్ సమస్య మరింత జఠిలమవుతుంది. దీనికి తోడు నడి రోడ్డుపైనే ఇష్టానుసారం పార్కింగ్‌లు, వ్యాపారాలతో ట్రాఫిక్ సమస్య మరింత తీవ్రమవుతుంది. ముఖ్యంగా గుళ్ళపల్లి కోఠీ సెంటర్, ఎన్ఆర్ఐ కళాశాల, అంబేద్కర్ సెంటర్, పోలీస్ స్టేషన్ సెంటర్ తదితర ప్రాంతాలలో తరచూ ట్రాఫిక్ సమస్య ఏర్పడుతుంది. దీనికి తోడు జాతీయ రహదారిపై భారీ వాహనాలు రావటంతో వాహనదారులతో పాటు పాదచారులు కూడా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

- మండల కేంద్రంలో పార్కింగ్ ప్లేస్ లేకపోవటంతో గుళ్ళపల్లి మొదలు చెరుకుపల్లి ఖాదర్ ఖాన్ సెంటర్ వరకు.. కనగాల ప్రధాన రహదారిపైనే ద్విచక్ర వాహనాలు, ఆటోలు, కార్లు, ముఖ్యంగా కళాశాలల బస్సులు, నిబంధనలకు విరుద్ధంగా పార్క్ చేస్తుండడంతో మరింత ట్రాఫిక్ సమస్య ఏర్పడుతుంది.
- జాతీయ రహదారిపై అను నిత్యం దూర ప్రాంతాల నుంచి భారీ కంటైనర్లు, పెద్ద పెద్ద వాహనాలు లోడుతో వస్తూ పోతూ ఉంటాయి. అయితే ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల బస్సులు ఉదయం, సాయంత్రం నడి రోడ్డుపైనే ఆపి విద్యార్థులను ఎక్కించుకోవటం, దించటం చేస్తుంటారు. దీంతో మరింత ట్రాఫిక్ సమస్యకు కారకులవుతున్నారు.

రోడ్లపైనే వ్యాపారాలు

216 జాతీయ రహదారి నిర్మించి రోడ్డుకు ఇరువైపులా డ్రైనేజీలు ఏర్పాటు చేసి ఇనుప రైలింగ్‌ను కూడా అమర్చారు. అయితే మాకు నిబంధనలు వర్తించవు అన్నట్టుగా డ్రైనేజీలు, రైలింగ్‌ను కూడా దాటి వచ్చి వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగేలా కొందరు వ్యాపార కార్యకలాపాలు సాగిస్తున్నారు. ముఖ్యంగా జాతీయ రహదారిని ఆనుకొని టిఫిన్ వ్యాపారాలు యథేచ్ఛగా కొనసాగిస్తున్నారు. రహదారి పక్కన ఏదైనా భారీ వాహనం పొరపాటున తగిలితే కాగి ఉన్న నూనె ప్రజలపై పడి ప్రమాదం జరిగే అవకాశం లేకపోలేదు. కొందరైతే వారి ఇళ్లు, కొట్ల ముందు ఇష్టానుసారం వాహనాలు పార్క్ చేస్తున్నారు. మరి కొందరు రోడ్డును ఆక్రమించుకుని వ్యాపారాలు చేయటమే కాక, చిరు వ్యాపారుల నుంచి రోజువారీ అద్దెలు కూడా వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. అసలే నిత్యం రద్దీగా ఉండే ప్రాంతం కావడం, ఎంత దూరం ట్రాఫిక్ స్తంభించినా పట్టించుకునే నాథుడే లేడని వాహనదారులు, పాదచారులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నరు. ఇప్పటికైనా పోలీసు వారు ట్రాఫిక్ సమస్యపై ప్రత్యేక దృష్టి సారించి సమస్య పరిష్కరించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

పెదపులివర్రులో ప్రత్యేక పూజలు



పెదపులివర్రు(భట్టిప్రోలు): భట్టిప్రోలు మండలం వ్యాఘ్రపుర క్షేత్రంగా ప్రసిద్ధి గాంచిన పెదపులివర్రు గ్రామంలో స్వయంభువుగా కొలువైన బాలా త్రిపురసందరి సమేత రాజారాజ నరేంద్ర స్వామి ఆలయంలో శుక్రవారం ఘనంగా పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారిని, అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. శ్రవణ నక్షత్రం పురస్కరించుకుని ప్రాతఃకాల పూజలు, అభిషేకాలు, అమ్మవారికి కుంకుమార్చనలు జరిగియి. భక్తులకు అమ్మవారి దివ్య అనుగ్రహ దర్శనం గావించారు.

మహిళపట్ల అసభ్యంగా ప్రవర్తించిన వారిపై కేసు నమోదు

కర్లపాలెం: మండల పరిధిలోని తుమ్మలపల్లి గ్రామానికి చెందిన ఓ మహిళ పట్ల ముగ్గురు వ్యక్తులు అసభ్యంగా ప్రవర్తించిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కర్లపాలెం ఎస్ఐ జి.రవీంద్ర తెలిపిన వివరాల మేరకు తుమ్మలపల్లి గ్రామానికి చెందిన ఓ వివాహిత మహిళ గత నెల 31వ తేదీ రాత్రి ఆరోగ్యం బాగుండక గ్రామంలోని ఆర్ఎంపీ వద్దకు వెళుతుండగా అదే గ్రామానికి చెందిన మల్లారపు శ్రీను, దుర్గారెడ్డితో పాటు మరో వ్యక్తి మహిళను అడ్డుకుని అసభ్యంగా ప్రవర్తించారని తెలియజేశారు. ఆ మహిళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పలు వినాయక మండపాల వద్ద అన్న సంతర్పణ కార్యక్రమం



గుళ్ళపల్లి రజక సంఘం ఆధ్వర్యంలో పూజలందుకుంటున్న గణనాథుడు



బాపట్లలో పూజలు అందుకున్న వినాయకుడు



చెరుకుపల్లిలోని కాపుల బజారులో అన్నదానంలో భక్తులు



మహాలక్ష్మీ చెట్టు సమీపంలోని వినాయక మండపం వద్ద అన్నదాన కార్యక్రమం

చెరుకుపల్లి: మండలంలో గణపతి నవరాత్రి ఉత్సవాలు గత పలు గ్రామాల్లోని కూడళ్లలో ప్రత్యేక మండపాలలో అత్యంత భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహిస్తున్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని కాపుల బజారులోని రామ మందిరంలో ఏర్పాటు చేసిన గణనాథుడి 20వ వార్షికోత్సవం, గుళ్ళపల్లి రజక సంఘం శ్రీలక్ష్మీగణపతి సంఘం వారు ఏర్పాటు చేసిన వినాయకుని 12వ వార్షికోత్సవం సందర్భంగా గత 10 రోజులుగా వినాయకుడికి ఉదయం, సాయంత్రం ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్త సమాజాల వారిచే ప్రత్యేక భజన కార్యక్రమాలు చేపట్టారు. చెరుకుపల్లి కాపుల బజారులో ఉదయం, గుళ్ళపల్లి రజక పేటలో సాయంత్రం కమిటీ వారు అన్న సంతర్పణ కార్యక్రమం నిర్వహించారు. శనివారం నిమజ్జన కార్యక్రమం నిర్వహించనున్నట్లు కమిటీ వారు తెలిపారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

వినాయకుని మండపం వద్ద భారీ అన్నదానం

బాపట్ల అర్బన్: బాపట్ల పట్టణంలోని ఎస్ఎన్‌పీ అగ్రహారం త్రవ్వకాలువ మహాలక్ష్మీ చెట్టు వద్ద మహాలక్ష్మీ సేవా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుని మండపం వద్ద భారీ అన్నదాన కార్యక్రమం శుక్రవారం చేపట్టారు. తొలుత వినాయకునికి పూజలు చేపట్టారు. మధ్యాహ్నం నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో దాదాపు 4 వేల అన్నప్రసాదాన్ని స్వీకరించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు సీహెచ్ మధుసూదనరావు, బి.విష్ణు, కిషోర్‌కుమార్, సాయి, ఆర్.సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ఆనందోత్సాహాల నడుమ మిలాద్–ఉన్–నబీ వేడుకలు



కొల్లూరు జెండా చెట్టు వద్ద అన్నప్రసాద వితరణలో హిందూ, ముస్లిం సోదరులు

కొల్లూరు: మహ్మద్ ప్రవక్త జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని మిలాద్–ఉన్–నబీ వేడుకలు ముస్లింలు అత్యంత భక్తిశ్రద్ధల నడుమ ఆనందోత్సాహాలతో శుక్రవారం జరుపుకున్నారు. తొలుత కొల్లూరులోని మసీదులో ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించి అనంతరం, స్థానిక జెండా చెట్టు వద్ద అన్న ప్రసాద వితరణ జరిపారు. మండలంలోని అనంతవరం, బొద్దులూరుపాడు, ఈపూరు, తిప్పలకట్ట ప్రాంతంలోని ముస్లింలు వేడుకలలో పాల్గొన్నారు. అన్న సంతర్పణ కార్యక్రమంలో ముస్లింలతో పాటు హిందువులు అధిక సంఖ్యలో పాల్గొని మత సామరస్యానికి ప్రతీకగా నిలిచారు.

ఘనంగా మిలాద్–ఉన్–నబీ వేడుకలు

భట్టిప్రోలు: మహ్మద్ ప్రవక్త జన్మదినం పురస్కరించుకుని మండలంలోని ముస్లింలు మిలాద్–ఉన్–నబీ వేడుకలను శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. అద్దేపల్లి, భట్టిప్రోలు, వేమవరం, పల్లెకోన, వెల్లటూరు గ్రామాలలోని మసీదుల్లో గత 12 రోజులుగా మత గురువులు మహ్మద్ ప్రవక్త చరిత్రపై ప్రవచనాలు ఇస్తున్నారు. 12 రోజులుగా పాటిస్తున్న ఉపవాస దీక్షలు బుధవారంతో ముగిశాయి. ప్రవక్త మహ్మద్ సల్లేలాహు వసల్లమ్ జన్మదినోత్సవం సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. హిందువులు, ముస్లింలకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

నత్తనడకన చప్టా నిర్మాణం పనులు



పేరలిపాడు వద్ద మురుగు కాలువపై నిర్మిస్తున్న చప్టా

కర్లపాలెం: పంట పొలాలకు సాగు నీరందించేందుకు పేరలిపాడు గ్రామం వద్ద మురుగు కాలువపై నిర్మిస్తున్న చప్టా పనులు నత్తనడకన సాగుతున్నాయి. వేసవి కాలంలో చప్టా నిర్మాణం పనులు పూర్తిచేసి పంట పొలాలకు నీరందించాల్సి ఉండగా అధికారులు, నీటి సంఘం నాయకుల అలసత్వం వలన కాలువలకు నీరు వచ్చే సమయం జూన్ నెలలో చప్టా నిర్మాణం పనులు ప్రారంభించారు. పేరలిపాడు పరిధిలోని పంట పొలాలకు తిమ్మరాజు చానల్ నుంచి పంట కాలువ ద్వారా సాగునీరు మురుగు కాలువపై నుంచి చప్టా(తొట్టి) ద్వారా వస్తాయి. గతంలో నిర్మించిన చప్టా శిథిలావస్థకు చేరటంతో కొత్తది నిర్మించేందుకు మే నెలలో పాత దానిని తొలగించారు. జూన్ నెలలో కొత్త చప్టా నిర్మాణానికి పనులు ప్రారంభించారు. ఈ ఖరీఫ్ సీజన్‌లో పైర్లకు సాగు నీరందించేందుకు తాత్కాలికంగా పైపులు ఏర్పాటు చేసినా సాగు నీరు రావటం లేదని ఇటీవల కురిసిన వర్షాలే పైర్లు పెరిగేందుకు దోహదపడ్డాయని రైతులు చెబుతున్నారు. చప్టా నిర్మాణం పూర్తిచేసి పైర్లకు సాగు నీరందించాలని రైతులు కోరుతున్నారు. దీనిపై ఇరిగేషన్ ఏఈ వెంకటరమణను వివరణ అడగగా చప్టా స్లాబు నిర్మించి సుమారు 15 రోజులు కావస్తుందని 21 రోజుల తరువాత చప్టా వద్ద పంట కాలువకు ఇరువైపులా గోడలు నిర్మించి సాగునీరందజేస్తామని తెలిపారు.

ఘనంగా గురుపూజోత్సవం



ప్రోడిజి విద్యాలయ్‌లో గురువులను అభినందిస్తున్న యాజమాన్యం



ఆహార సాంకేతిక కళాశాలలో గురుపూజోత్సవం



భట్టిప్రోలులో గురువును సత్కరిస్తున్న విద్యార్థులు



ఉత్తమ అవార్డు అందుకుంటున్న రోజారమణి



భట్టిప్రోలులో అంగన్‌వాడీ కేంద్రానికి కుర్చీలను అందచేస్తున్న దృశ్యం



వెల్లటూరులో విద్యార్థులకు మెడల్, సర్టిఫికెట్లు అందచేస్తున్న నిర్వాహకులు

బాపట్ల: మెరుగైన సమాజ ఏర్పాటులో గురువుదే కీలక పాత్రని, సమాజంలో ప్రతి ఒక్కరితో పూజింపబడేది గురువేనని ప్రోడిజి విద్యాలయ్ ప్రిన్సిపాల్ బ్రజేశ్ కానుస్‌గో అన్నారు. బాపట్ల మండలంలోని మత్స్యపురి కాలనీ కనకాద్రి నగర్‌లో ప్రోడిజి విద్యాలయ్ సీబీఎస్ఈ పాఠశాలలో గురుపూజోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పాఠశాలలోని ఉపాధ్యాయులకు విద్యార్థులు పాద పూజ చేశారు. విద్యార్థులను ఉపాధ్యాయులు ఉన్నతంగా ఎదగాలని ఆశీర్వదించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ మాచాబత్తిని శ్రీనివాసరావు, డైరెక్టర్లు శ్రీనివాసరావు, పార్థసారథి, ఉదయచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ ఎన్టీఆర్ ఆహార విజ్ఞాన శాస్త్ర సాంకేతిక కళాశాలలో

ఆచార్య ఎన్జీ రంగా విశ్వవిద్యాలయం, డాక్టర్ ఎన్టీఆర్ ఆహార విజ్ఞాన శాస్త్ర సాంకేతిక కళాశాలలో శుక్రవారం ఉపాధ్యాయ దినోత్సవాన్ని విద్యార్థులు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ఎం.సర్దార్ బేగ్ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో తొలుత డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ఎం.సర్దార్ బేగ్ ప్రసంగిస్తూ డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ కీర్తిని విద్యార్థులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎన్.వినోద, అసిస్టెంట్ ప్రొఫెసర్స్ డాక్టర్ సీహెచ్ సోమేశ్వరరావు, వై.అరుణకుమారి, కె.సౌజన్య, డాక్టర్ ఎస్.బ్లెస్సి సాగర్, డాక్టర్ ఇ.గౌతమి, డాక్టర్ కె.నివేదిత, టీచింగ్ అసోసియేట్స్ డాక్టర్ సునీత, డాక్టర్ దిలీప్, డాక్టర్ వినోద్‌బాబు, లావణ్య, నూకరత్నం, వ్యాయామ ఉపాధ్యాయులు డాక్టర్ ఫణీంద్ర తదితరులు పాల్గొన్నారు.

గురువుకు సత్కారం

భట్టిప్రోలు: గురు పూజోత్సవం పురస్కరించుకుని భట్టిప్రోలుకు చెందిన ఇంజనీరింగ్ భౌతికశాస్త్ర అధ్యాపకులు బిట్రా హేమచంద్రరావును శుక్రవారం శిష్యులు ఘనంగా సన్మానించారు. గురువులను సత్కరించి వారి ఆశీస్సులు అందుకోవడం ఆనందదాయకంగా ఉందని వారు పేర్కొన్నారు. జీవితంలో ఎంత ఎత్తుకు ఎదిగినా మన మూలాలను మర్చిపోకూడదనే ఉద్దేశంతో నేటి విద్యార్థుల సైతం గురువులను పూజిస్తూ ఈ ఒరవడిని కొనసాగించాలని వారు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ ఉపాధ్యాయ దినోత్సవం జరుపుకోవడానికి కారకులైన డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్‌కు నందం జ్యోతిభార్గవి, పూర్వజ్ సాయి, పూర్వాన్ష్ తదితరులు నివాళి అర్పించారు. హేమచంద్రరావు మాట్లాడుతూ ఉత్తమమైన ఉపాధ్యాయ వృత్తిని ఎన్నుకుని ఎంతో మంది విద్యార్థులకు మంచి విద్యాబుద్ధులను అందించడం ఒక వరమని అన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్న రోజారమణి

భట్టిప్రోలు: భట్టిప్రోలు మండలం వెల్లటూరు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు (ఎల్ఈ) ఓలేటి రోజా రమణి శుక్రవారం జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి చేతులమీదగా జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును బాపట్లలో అందుకున్నారు. కార్యక్రమంలో బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ, పార్లమెంట్ సభ్యులు తెన్నేటి కృష్ణప్రసాద్, పోతుల సునీత, జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.పురుషోత్తం పాల్గొన్నారు.

వాసవి క్లబ్ ఆధ్వర్యంలో గురుపూజోత్సవం

భట్టిప్రోలు: వాసవి క్లబ్స్ ఇంటర్నేషనల్, భట్టిప్రోలు క్లబ్, కుబేర వనిత క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం భట్టిప్రోలు గురుపూజోత్సవంలో జిల్లా గవర్నర్ అధికార పర్యటన జరిగింది. ఈ సందర్భంగా స్థానిక రుక్మిణి సత్యభామా సమేత వేణుగోపాలస్వామి దేవస్థానంలోని సాయికృష్ణ కల్యాణ కళావేదిక ఆవరణలో భట్టిప్రోలు–అద్దేపల్లి ఆర్యవైశ్య ఉపాధ్యాయులకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. విశ్రాంత జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ, యునెస్కో అవార్డు గ్రహీత బొలిశెట్టి శ్రీనివాసరావు గవర్నర్ పులికొండ శ్రీనివాసరావు చేతుల మీదగా కుర్చీలను అంగన్‌వాడీ కేంద్రానికి బహూకరించారు. ఈ సందర్భంగా గవర్నర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ సిమెంట్ బెంచీలు, మొక్కలు నాటుట, విద్యార్థులకు స్టేషనరీ పంపిణీ చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు బూర్లె వెంకట చంద్రశేఖరరావు, కొత్త నాగ వెంకట రవి తేజ, విడేల శ్రీనివాసరావు, మద్దుల లక్ష్మి ప్రియ, తూనుగుంట్ల బేబిరాణి, మద్దుల వెంకట లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వెల్లటూరులో...

మండలంలోని వెల్లటూరు వాసవి క్లబ్ ఆధ్వర్యంలో జిల్లా గవర్నర్ అధికార పర్యటనలో భాగంగా శుక్రవారం జిల్లా టీమ్ గ్రామ దేవత ముత్యాలమ్మ, కట్లమ్మ, మహాలక్ష్మమ్మ అమ్మవార్లను దర్శించుకున్నారు. స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపం వద్ద, జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా మహాత్మాగాంధీ, పొట్టి శ్రీరాముల విగ్రహాలకు, సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. గత విద్యా సంవత్సరం 10వ తరగతిలో ప్రతిభ చూపిన విద్యార్థులను మెడల్స్, సర్టిఫికెట్లు, జ్ఞాపికలతో సన్మానించారు. కార్యక్రమంలో విద్యార్థులకు నోట్ పుస్తకాలు, బిస్కెట్ ప్యాకెట్లు అందచేశారు.

అద్దేపల్లిలో చంద్రశాలకు శంకుస్థాపన



భట్టిప్రోలు: భట్టిప్రోలు పంచాయతీ పరిధిలోని అద్దేపల్లి గ్రామంలో నిర్మాణంలో ఉన్న సీతారామస్వామి కల్యాణ వేదిక పై అంతస్తు(చంద్రశాల)కు శుక్రవారం శ్రీరామ నామ క్షేత్ర కమిటీ అధ్యక్షుడు కొన్నిపాటి భాస్కరరావు శంకుస్థాపన చేశారు. వంగర చలమయ్య సిద్ధాంతి ఆధ్వర్యంలో పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. కార్యక్రమంలో కమిటీ నిర్వాహకులు కాగిత దుర్గాప్రసాద్, మారుతీకుమార్, ఆంజనేయులు, గొట్టుముక్కల లోకనాథ్, కొన్నిపాటి సత్యనారాయణ, పానుగుపాటి శివనాగభిక్షం తదితరులు పాల్గొన్నారు.

పంటలకు రసాయన ఎరువులు తగ్గించాలి



చెరుకుపల్లి: రైతులు రసాయన ఎరువుల తగ్గించి సేంద్రియ ఎరువులు వాడాలని బాపట్ల జిల్లా ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు మేనేజర్ హుస్సేన్ రైతులకు సూచించారు. శుక్రవారం మండలంలోని నడింపల్లి గ్రామంలో ఆయన పర్యటించి పురుగు మందులు, ఎరువులు, కలుపు మందులు వాడకుండా పండుతున్న దుంప, తీగజాతి, ఆకుకూరలు, కూరగాయలు, పువ్వుల పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా హుస్సేన్ మాట్లాడుతూ సేంద్రియ ఎరువులతో తక్కువ ఖర్చుతో ఆరోగ్యవంతమైన పంటలు పండించితే ఆరోగ్యానికి ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు, కావునా ఈ పద్ధతిలో తక్కువ స్థలం, తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడి, ఆరోగ్యకరమైన కూరగాయలు, ఆకుకూరలు పండించుకోవచ్చన్నారు. గృహిణులు, వ్యవసాయ కూలీలు, రైతులు ఈ పద్ధతిని పాటించాలని హుస్సేన్ సూచించారు. కార్యక్రమంలో సేంద్రియ వ్యవసాయ నడింపల్లి యూనిట్ ఎల్–1 రాహేల్‌రావు, ఎల్–2 రమేష్ తదితరులు పాల్గొన్నారు.